సాక్షి నంద్యాల

బుధవారం । 21 । ఆగస్టు । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె. నాగిరెడ్డి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ నిత్య కళా వేదికపై మంగళవారం వనపర్తికి చెందిన అభినయ కల్చరల్ అకాడమీ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.13
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 77.231
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 31,033
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:10,201

న్యూస్‌రీల్

ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆదేశాల మేరకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 6వ తేదీ వరకు గడువు ఉందని డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి పుట్టిన తేదీ, తండ్రి పేరు, ఆధార్ కార్డుతో www.bsc.ap.gov.in ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షలు ఉన్న విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు.

వీబీఆర్‌కు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

వెలుగోడు: బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వీబీఆర్‌కు మంగళవారం 11 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో వీబీఆర్ నుంచి తెలుగుగంగ మద్రాస్ కాలువకు 5 వేల క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా గాలేరుకు 5 వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని బయటకు పంపుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 14.494 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఈయూ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం):నంద్యాల ఆర్టీసీ డిపోలో మంగళవారం తెల్లవారుజామున ఈయూ (ఎంప్లాయీస్ యూనియన్) ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కొండారెడ్డి, మూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డ్రైవర్లకు రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలని, డ్రైవర్, కండక్టర్ చార్ట్ వేయాలని, డీసీల సఫలింగ్ చేయాలని, ఎక్సెస్ పేరుతో తొలగించిన 3 ఏడీసీలను కొనసాగించాలని, యూనియన్ పట్ల పక్షపాత దోరణి విడనాడాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. నిరసనలో ఆర్టీసీ ఉద్యోగులు మద్దిలేటి, దేవసహాయం, వెంకటేశ్వర్లు, ఆనంద్, మస్తాన్‌వలి, కృష్ణ, సుబ్బయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

24వ తేదీలోగా బదిలీల దరఖాస్తులు పంపండి

కర్నూలు (అర్బన్): జిల్లాపరిషత్ యాజమాన్య పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన డీడీఓలు తమ కార్యాలయాలకు సంబంధించిన ఉద్యోగుల బదిలీల దరఖాస్తులను ఈనెల 24వ తేదీ లోగా పంపాలని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరారు. జీవో ఎంఎస్ నెంబర్ 75 ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన బదిలీల మార్గదర్శకాలకు అనుగుణంగా ఐదు సంవత్సరాలు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగుల దరఖాస్తులను, రిక్వెస్ట్ బదిలీలు తదితర వాటన్నింటినీ సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీలను జిల్లాపరిషత్ కార్యాలయానికి zppasection@gmail.com అనే మెయిల్ ద్వారా పంపాలన్నారు.


రాత్రిపూట కరెంట్ ఇస్తే పొలాలకు నీళ్లు ఎలా పెట్టాలి?



రాత్రిపూట కరెంట్ సరఫరా చేస్తే పంటలకు నీరు పెట్టాలంటే ప్రాణాలకు ముప్పు తప్పదు. విషపురుగుల బెడద, కరెంట్ ప్రమాదాల నుంచి తప్పించుకోవడం కష్టం. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాత్రిపూట పంటలకు నీరు పెడుతున్నాం. గతంలో పగలే 9 గంటలు ఉచితంగా కరెంట్ ఇచ్చారు. నాకు పది ఎకరాల పొలం ఉంది. వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లల్లో నీళ్లు తగ్గిపోయాయి. పది ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. పగటిపూటనే పంటలకు నీరు పెడతున్నా. రాత్రిపూట నీరు పెట్టాలంటే భయంగా ఉంది. ఓట్ల కోసం పగలే 9 గంటల ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో వేకుజామున 4 నుంచి ఉదయం 10 గంటల వ రకు,రాత్రి 9 నుంచి 12 గంటల మధ్య ఇస్తున్నారు.

– నాగేశులు, రైతు, జూపాడుబంగ్లా

చీకట్ల పాలన



ఆరు గంటలు విద్యుత్ లేక..



చిత్రంలో ఇంటి బయట నిద్రిస్తున్న వారు కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామస్తులు. ఈ గ్రామంలో శనివారం అర్ధరాత్రి 12.30 నుంచి 2.30 గంటల వరకు, ఆదివారం తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ లేకపోవడంతో ఇంట్లో ఉక్కపోత భరించలేక ఇంటి ఆవరణలో నిద్రించారు. ఇదే మండలంలో అదే రోజు రాత్రి పలు గ్రామాల్లో రెండు, మూడు గంటలు విద్యుత్ లేదు. కారణం మాత్రం సంబంధిత అధికారులను అడిగినా చెప్పడం లేదు. అప్రకటిత కోతలకు ఇదే నిదర్శనం.

- జిల్లాలో పెరుగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలు
- వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు సరఫరా చేయని వైనం
- అవస్థలు పడుతున్న వినియోగదారులు, రైతులు

సాక్షి, నంద్యాల: కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తాం.. విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం.. అంటూ ఎన్నికల వేళ కూటమి నేతలు ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. వానా కాలంలో రోజుకు మూడు నాలుగు గంటలు విద్యుత్ కోతలు వేధిస్తుండటంతో వేసవి కాలంలో కోతలు ఎలా ఉంటాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పగటి పూట వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాకు మంగళం పాడే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లాలో రెసిడెన్షియల్ కనెక్షన్లు 5,79,056 ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు 1,17,217 ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజు సరాసరిగా 7.72 మిలియన్ల యూనిట్ల విద్యుత్ వినియోగమవుతోంది. కానీ, డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా లేదు. కరెంట్ లోటును పూడ్చుకునేందుకు అనధికార కోతలు విధిస్తున్నారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాల నుంచి గంట పాటు కరెంట్ కట్ చేస్తున్నారు. మరోవైపు చిన్న చినుకుపడినా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. మరమ్మతుల పేరుతో నెలలో ప్రతి రెండో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోతలు విధిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండు వేసవిలో లేనంతగా కోతలు ఇప్పుడు వానాకాలంలో ఉండటం విడ్డూరంగా మారింది. జిల్లా కేంద్రం, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేదు.. ఎప్పుడు పడితే అప్పుడు.. అన్నట్లుగా గంట, రెండు గంటలు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెద్ద గాలి వానలు, ఈదురు గాలులు వీస్తే విద్యుత్ సరఫరా నిలిపేశారని చెప్పడానికి జిల్లాలో ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. అప్రకటిత విద్యుత్ కోతల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో సేవలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



విద్యుత్ కోత.. ఉక్కపోత

జిల్లాలో ఎండ తీవ్రత పెరిగి వేసవిని తలపిస్తోంది. ఉదయం 11 గంటలు దాటిన తర్వాత బయటికి అడుగుపెట్టాలంటేనే జంకాల్సిన దుస్థితి నెలకొంది. అర గంట కరెంట్‌పోతే ఇళ్లలో ఉండలేకపోతున్నారు. ఓ వైపు ఉక్కపోతే ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మరోవైపు విద్యుత్ కోతలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎడాపెడా కోతలు విధిస్తూ అధికారులు వేడుక చూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రోజులో కనీసం ఏడెనిమిది సార్లు కరెంట్ కట్ చేస్తున్నారు. కట్ చేసిన ప్రతిసారి 15 నిమిషాల నుంచి అర గంట వరకు విద్యుత్‌ను నిలిపేస్తున్నారు. ఎప్పుడు కరెంట్ పోతుందో.. వస్తుందో తెలియని పరిస్థితితో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

పగలే 9 గంటలు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇష్టమొచ్చినట్లు విద్యుత్ సరఫరా చేస్తోంది. జూలై చివరి వరకు ఏడు గంటల పాటు ఇచ్చారు. మూడు వారాల నుంచి తొమ్మిది గంటలు ఇస్తున్నారు. అదీ కూడా రెండు విడతల్లో ఇస్తున్నారు. మధ్యమధ్యలో కట్ చేస్తున్నారు. దీంతో మోటార్ ఆన్ చేసి ఇక్కడే ఉంటున్నాం. 5 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. రాత్రి పూట కరెంట్ ఇస్తే విష పురుగుల భయం వెంటాడుతోంది. మా ప్రాంతంలో చిరుత, ఎలుగుబంట్లు కూడా తిరుగుతున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొలానికి నీళ్లు పెట్టుకునేందుకు వెళుతున్నాం. గత ప్రభుత్వం పగటిపూట రైతులకు ఉచితంగా 9 గంటలు కరెంట్ ఇచ్చి ఆదుకుంది.

– ఏసురత్నం, వేంపెంట గ్రామం, పాములపాడు మండలం

రాత్రి అంతా కరెంట్ లేదు



ఈ మధ్యకాలంలో నంద్యాల పట్టణంలో వర్షం పడిన సమయంలో రాత్రి అంతా కరెంట్ కట్ చేశారు. సాయంత్రం ఏడు గంటలకు తీసేస్తే మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. ప్రతీ రోజు కనీసం నాలుగైదు సార్లు కరెంట్ తీసేస్తున్నారు. అధికారులకు ఫోన్ చేస్తే లైన్లు ట్రిప్ అయ్యాయని, రిపేర్ చేస్తున్నామని చెబుతున్నారు. మెయింటెనెన్స్ సక్రమంగా చేపట్టకపోయి నప్పుడే ట్రిప్ అవుతోంది. ఈ ఉక్కపోతకు కరెంట్ కోతలు తోడు కావడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. చిన్న పిల్లలు ఉన్నవారి బాధ వర్ణనాతీతం. అధికారులు స్పందించి కోతలు నివారించాలి.

– దూదేకుల ఖాసీం, కానాల గ్రామం, నంద్యాల మండలం

వ్యవసాయం.. 'వేళా'కోలం

వ్యవసాయానికి పగటి పూటనే తొమ్మిది గంటల పాటు కరెంట్ సరఫరా చేస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కానీ, ప్రస్తుతం ఆయన హామీ జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ అమలు కావడం లేదు. నంద్యాల జిల్లాలో 1,17,217 వ్యవసాయ కనెక్షన్లున్నాయి. ఫీడర్ల వారీగా అర్ధరాత్రి సమయాల్లోనూ కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో సరఫరా చేస్తుండడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అధిక ప్రాంతాల్లో రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు.. తెల్లారు జామున 4 నుంచి 10 గంటల వరకు సరఫరా చేస్తున్నారు. అదీ కూడా మధ్యమధ్యలో కట్ చేస్తూ ఇస్తుండడంతో రైతులు పొలం గట్లమీదే కాపలా కూర్చోవాల్సిన దుస్థితి దాపురించింది. జూన్‌లో వ్యవసాయానికి రోజుకు 7 గంటలు మాత్రమే సరఫరా చేశారు.శ్రీశైలం జల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుంచి మాత్రమే 9 గంటలు సరఫరా చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పగటి పూట మాత్రమే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసేవారు. ఒక వారం ఉదయం 6 గంటల నుంచి 3 గంటల వరకు మరో వారం 8 నుంచి 5 గంటల వరకు ఏకధాటిగా కరెంట్ సరఫరా అయ్యేది. అలాగే జిల్లాలో ఎలాంటి విద్యుత్ అవాంతరాలు ఏర్పడకుండా 330 మంది సిబ్బందిని నియమించింది. సచివాలయాల పరిధిలో వీరు విధులు నిర్వహించేవారు. దీంతో



ఎక్కడ ఏం ఇబ్బంది తలెత్తినా వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించండి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో వంద రోజుల ప్రణాళిక అమలు తీరుపై ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పగించిన పనులను అంకెల గారడీగా కాకుండా నాణ్యతతో సమర్థవంతంగా నిర్వహించి ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రతిరోజు కనీసం రెండు చొప్పున పూర్తి చేస్తూ పురోగతి సాధించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించేందుకు పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బేతంచెర్లలో బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో 65 మంది పిల్లలు బయట టాయిలెట్‌కి వెళ్తున్నారని, త్వరితగతిన టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లను తనిఖీ చేసి పిల్లలతో పాటు ఒకరోజు భోజనం చేయాలన్నారు. ప్రతి ఏపీఓ ఉదయం 6.30 గంటలకు ఫీల్డ్‌లో ఉంటూ పని కావాలని అడిగిన వారందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

బొమ్మలసత్రం: నంద్యాల సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రాజకుమారి వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రి సమావేశ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్‌కు అవసరమైన రిఫ్రిజిరేటర్, సెంట్రిఫ్యూజ్, డిస్టిల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అవసరమయ్యే పరికరాలను ఆరోగ్యశ్రీ నిధుల నుంచి సమకూర్చుకోవాలన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెనూ ప్రకారం రోగులకు పౌష్టికాహారం అందించాలన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వరప్రసాదరావు, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలీశ్వరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ దందాకు 'పచ్చ' జెండా

- బియ్యం అక్రమ రవాణా అడ్డగా డోన్
- బియ్యం వ్యాపారుల అవతారమెత్తిన టీడీపీ నేతలు
- తమకే విక్రయించాలని బెదిరింపులు
- మాట వినని డీలర్ల చేత బలవంతపు రాజీనామాలు
- బహిరంగంగా అక్రమ నిల్వలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు



కొత్తపల్లె నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తున్న దృశ్యం



ప్రభుత్వ ఐటీఐ సమీపంలోని గోడౌన్ నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

డోన్: 'ప్రభుత్వం మాదే.. మాకెవరూ అడ్డు చెప్పేదెవరూ'.. అంటూ టీడీపీ నేతలు బియ్యం అక్రమ దందాకు తెరలేపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇదే వ్యాపారం చేసిన ఇద్దరితో పాటు కొత్తగా మరో నేత కూడా ఇదే వ్యాపారాన్ని ఉపాధిగా మార్చుకున్నాడు. దర్జాగా రేషన్ బియ్యాన్ని సేకరించి బహిరంగా నిల్వ చేసి సరిహద్దులు దాటిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తూ బియ్యం అక్రమ రవాణాను అరికట్టగా ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రేషన్ దందాకు పచ్చ జెండా ఊపింది. నియోజకవర్గంలో 86,480 మంది రేషన్ కార్డుదారులు ఉండగా, ప్రతి నెల 12 వేల టన్నుల పీడీఎస్ బియ్యం పంపిణీ జరుగుతోంది. కార్డుదారుల నుంచి కొంత, డీలర్ల నుంచి ఇంకొంత సేకరించి బహిరంగంగా అక్రమంగా పట్టణంలో మూడు ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని లారీల్లో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు రెట్టింపు ధరతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తమ మాట వినని డీలర్లపై అనుకూలమైన అధికారుల ద్వారా వేధింపులకు గురిచేస్తున్నారు. నియోజకవర్గంలో 114 మంది రేషన్ దుకాణ డీలర్లు ఉండగా, ఇప్పటికే సగం మంది ఒత్తిళ్లకు తాళలేక రాజీనామా చేశారు. మరికొందరిపై రెవెన్యూ అధికారులతో దాడులు చేయించి సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేయించేందుకు అధికార పార్టీ నాయకులు రంగం సిద్ధం చేశారు. ఇటీవల డోన్ మండలం ఓబులాపురం గ్రామంలో డీడీ కట్టి రేషన్ బియ్యం గ్రామానికి తీసుకువచ్చిన డీలర్ వాహనాన్ని అధికార పార్టీ నాయకులు అడ్డగించినా ఏఒక్క అధికారి కూడా నోరు మెదపలేదు.

తమ్ముళ్ల కోసం కొత్త దుకాణాలు

ప్రస్తుతం ప్యాపిలి మండలంలో 54, బేతంచెర్లలో 48, డోన్ మండలంలో 72 చౌకదుకాణాలు ఉన్నాయి. అయితే కొంత మంది టీడీపీ నాయకులకు ఉపాధి కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న దుకాణాలను విభజన చేసి కొత్త దుకాణాలు మంజూరు చేయించాలనే ప్రయత్నం జరుగుతోంది. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో చౌక దుకాణంలో 900 మంది కార్డుదారులు మొదలుకొని ఆ ఊరిలో కుటుంబాల సంఖ్య మేరకు ఉన్నాయి. అయితే ప్రతి దుకాణంలో 400 మంది కార్డుదారులు మించకుండా విభజన చేయించి కొత్త దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చనే ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు అధికారులతో నియోజకవర్గ అధికార పార్టీ నేత ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

ఆ ముగ్గురికే విక్రయించాలట..

ఊరూరా తిరిగి బియ్యం సేకరించే వారైనా.. డీలర్లు అయినా రేషన్ బియ్యాన్ని ముగ్గురు టీడీపీ నేతలకు విక్రయించాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అక్రమ మార్గంలో డోన్ పట్టణానికి చేర్చే రేషన్ బియ్యాన్ని వ్యాపారులు ఐటీఐ కళాశాల వద్ద, శ్రీనివాసనగర్, మార్కెట్‌యార్డు, కొత్తపల్లె ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి డీలర్ల నుంచి సేకరించిన బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్రతో పాటు మన రాష్ట్రంలోని మద్యం తయారీ పరిశ్రమలు, రైస్‌మిల్లులకు వాహనాల్లో రాత్రిళ్లు తరలిస్తున్నారు.

అధికారులే అండా దండా..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు నెలవారి మామూళ్లకు కక్కుర్తి పడి అక్రమ రవాణాదారులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు అందాల్సిన రేషన్ బియాన్ని పచ్చ గద్దలు మెక్కేస్తున్నాయి. ప్రణాళిక ప్రకారం దోచుకునేందుకు అనధికార నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసినా అడిగేనాథుడు లేడు. మూడు నెలల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా బహిరంగంగా జరుగుతోంది. నియంత్రించాల్సిన ఆయా శాఖలు మౌనం వహిస్తుండటంతో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇకపై ఆరు రోజులు

- ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు
- సెల్ఫ్ అసైన్‌మెంట్‌గా పేరు మార్పు
- ఈనెల 27 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్షలు



తరగతి గదిలో విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల సామర్థ్యం అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును సెల్ఫ్ అసెస్‌మెంట్ (స్వీయ మూల్యాంకనం)గా మార్చుతూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (నిర్మాణాత్మక మూల్యాంకనం) పేరుతో మూడు రోజులు నిర్వహించే వారు. తాజాగా పరీక్షలు షెడ్యూల్ ప్రకారం ఆరు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు. స్వీయ మూల్యాంకనం వన్ పరీక్షలను ఈనెల 27 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు మినహా అన్ని ప్రభుత్వాలు అనుబంధ పాఠశాలకు పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా పరీక్ష పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

20 మార్కులకు పరీక్ష ...

ఇంతవరకు యూనిట్ పరీక్షలు స్థానంలో నిర్వహించే ఫార్మెటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసే వారు. తాజా మార్గదర్శకాల ప్రకారం సబ్జెక్టుకు ఆరు రోజులపాటు నిర్వహించనున్నారు. దీనివల్ల సిలబస్ వైపు రావాల్సి ఉంటుందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. నెలవారి సిలబస్‌లో మూడు రోజులు కుదించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

షెడ్యూల్ ఇది...

ఈనెల 27 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 28న తెలుగు, 30న ఇంగ్లిషు, 31న గణితం, సెప్టెంబర్ 2న పరిసరాల విజ్ఞానం పరీక్షలు ఉంటాయి. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లిషు, 2న గణితం, 3న సైన్స్, 4న సోషల్ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించనున్నారు.

టోఫెల్ పరీక్షలకు మంగళం...

ఈ విద్యా సంవత్సరం ప్రారంభించి జూలై వరకు టోఫెల్ తరగతులు నిర్వహించారు. జూలై 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024–25 అకాడమీ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణపై ఎలాంటి పీరియడ్స్ కేటాయించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో ఇంత వరకు అమలవుతున్న టోఫెల్ తరగతులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడినట్లుగా కనిపిస్తోంది. దీంతో ఈ స్వీయ మూల్యాంకనం పరీక్షల్లో టోఫెల్ పరీక్షలు నిర్వహించారు.

డీసీఈబీ నుంచి ప్రశ్నాపత్రాలు



నిర్మాణాత్మక మూల్యాంకనం పేరును స్వీయ మూల్యాంకనంగా మార్చి ఈనెల 27 నుంచి నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం సమాచారం ప్రకారం డీసీఈబీ ముద్రించిన ప్రశ్న పత్రాలు ఆయా పాఠశాలకు అందేలా చర్యలు తీసుకుంటాం. 3 నుంచి 8 తరగతుల వరకు సీబీఏ విధానంలో ఓఎంఆర్ షీట్స్‌పై పరీక్షలు నిర్వహిస్తాం.

– శ్రీనివాసరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ, నంద్యాల

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా పగిడ్యాల మండలంలో 95.02మి.మీ వర్షపాతం నమోదైంది. నందికొట్కూరు 72. మి.మీ, జూపాడుబంగా 67.4, రుద్రవరం 66.6, మిడుతూరు 65.4, వెలుగోడు 64.8, గోస్పాడు 60.2, డోన్ 54.2, పాములపాడు45.8, బనగానపల్లె 40.2, ఉయ్యాలవాడ 34.4, ఆత్మకూరు 33.2, బేతంచెర్ల 30.2, ప్యాపిలి 30.0, గడివేముల 28.6, కొత్తపల్లి 26.6, శ్రీశైలం 25.8, అవుకు 25.4, కొలిమిగుండ్ల 22.6, శిరివెళ్ల 20.0, మహానంది 14.4, పాణ్యం 11.8, సంజామల 10.2, నంద్యాల 9.2 మి.మీ వర్షపాతం మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూపాడు బంగ్లా మండలంలో బన్నూరు సమీపంలో కాకిలేరువాగు ఉప్పొంగడంతో సమీపంలోని పొలాలు నీట మునిగిపోయాయి. పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్ ఎస్సీ కాలనీ, పడమర ప్రాతకోట గ్రామంలోని బీసీ కాలనీ, ముస్లిం కాలనీలలో వర్షపునీరు నిల్వ ఉండి ఇళ్లల్లోకి ప్రవేశించడం వలన కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షం తాకిడికి కంకి దశలోని మొక్కజొన్న పైర్లు నేలవాలడంతో రైతులు నష్టపోయారు.



జూపాడుబంగ్లా మండలం బన్నూరు సమీపంలో పొంగిపొర్లుతున్న కాకిలేరువాగు



ముచ్చుమర్రిలో నేలకొరిగిన మొక్కజొన్న పైరు

క్లుప్తంగా

జీడీపీకి 24 వేల క్యూసెక్కుల వరద


గాజులదిన్నె ప్రాజెక్ట్

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షం కురవడంతో 24 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మోస్తారు వర్షం కురిసింది. జీడీపీ నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 1.7 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. జీడీలోకి ఇంకా వరద నీరు కొనసాగుతుందన్నారు.

లోన్ మేళాలను ఏర్పాటు చేయండి

కర్నూలు(సెంట్రల్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి లోన్ మేళాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పరిశ్రమలు, బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ స్పెషల్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు జాబ్ మేళాల తరహాలో పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాయం అందించేందుకు లోన్ మేళాలను ఏర్పాటు చేయాలని ఎల్‌డీఎం రామచంద్రరావును ఆదేశించారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలను స్థాపించేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు లోన్ మేళాలు ఎంతో ఉపయోగకరమన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో క్లస్టర్లు ఏర్పాటు చేసి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్‌ఎంఈ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా సింగిల్ విండోలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఇక నుంచి డీఐఈపీసీ సమావేశాన్ని మూడు నెలలకు బదులుగా నెలకొకసారి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కోఆర్డినేటర్ దిలీప్ పలు వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతిప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం సోమశేఖరరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన చంద్రబాబు

బొమ్మలసత్రం: కుటుంబ కలహాలతో వంతెన పైనుంచి రైల్వే ట్రాక్‌పైకి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన చంద్రబాబు, అపర్ణకు 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. చంద్రబాబు కర్నూలులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య పార్నపల్లెలో పిల్లలతో కలిసి ఉండటంతో అప్పుడప్పుడూ ఇంటికి వచ్చి వెళ్లేవాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన చంద్రబాబు భార్యతో గొడవపడ్డాడు.ఈ క్రమంలో మంగళవారం ఉదయం నూనెపల్లె వద్దకు చేరుకుని వంతెన పైనుంచి రైల్వే ట్రాక్ పైకి దూకడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రైల్వే పోలీసులకు ఫోన్ చేసి సమాచా రం అందించడంతో వారు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక చంద్రబాబు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


హెడ్ మూమెంట్ కోసం ఆటోకు వాచింగ్ యాప్‌ను తగిలిస్తున్న రవాణా సిబ్బంది


డ్రైవింగ్ తీరును కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు


వాచింగ్ యాప్ బిగించుకుని ట్రాక్‌పైకి వెళ్తున్న ఆటో


టెస్ట్‌లో భాగంగా సిగ్నల్స్ వద్ద నిబంధనలు పాటిస్తున్నారా, లేదా అని పరిశీలిస్తున్న అధికారులు

తడబడితే పట్టేస్తుంది!

- రవాణా కార్యాలయంలో డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టం
- అమల్లోకి హైటెక్ సెన్సార్ విధానం
- ట్రాక్‌లోకి వెళ్తే అదే చెప్పేస్తుంది
- సెన్సార్లతో డ్రైవింగ్ నైపుణ్యం గుర్తింపు
- పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో అమలు

ట్రాక్ మొత్తం నిఘా గుప్పిట్లో...


హై రెజల్యూషన్ కెమెరాలు, సెన్సార్లు


ఓవర్‌హెడ్ వీడియో సెన్సార్లు



ట్రాక్‌లో ఏర్పాటు చేసిన రీడర్ పోల్స్, సిగ్నల్స్


సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్‌లో నిబంధనల ప్రకారం నడుపుతున్న ఆటో

కర్నూలు: వాహనం నడపడం సరిగా రాకున్నా లైసెన్స్ మంజూరు చేస్తే ఏమవుతుందో చెప్పనవసరం లేదు. ట్రాక్ నిబంధనలు తెలియకుండా వాహనాలు నడపడం ప్రమాదాలను ఆహ్వానించినట్లే. కొందరు వ్యక్తులు ట్రాక్ పైకి వెళ్లకుండానే మధ్యవర్తుల ప్రమేయంతో డ్రైవింగ్ లైసెన్స్ పొందేవారు. సరైన నైపుణ్యం లేకుండా వాహనాలు నడుపుతుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ప్రజలతో ముడిపడి ఉన్న రవాణా శాఖలో దళారుల ద్వారా వచ్చిన వారికే లైసెన్సులు దక్కేవి. ఇది గతం. ఇకపై అలాంటి పరిస్థితి ఉండదు. కర్నూలులో సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్ అమల్లోకి వచ్చింది. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఉన్న డ్రైవింగ్ ట్రాక్‌కు సైంటిఫిక్ పరిజ్ఞానం అనుసంధానం చేశారు. ఇందుకు సంబంధించిన సామగ్రి ట్రాక్‌లో అమర్చడంతో రెండు వారాల క్రితం ఈ విధానం అమల్లోకి వచ్చింది. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనం నడిపే ప్రతి వ్యక్తి నిబంధనలు తెలుసుకుని డ్రైవింగ్ చేసి లైసెన్స్ పొందేందుకు ఈ సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్ అందుబాటులోకి తెచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ తెలిపారు.

ట్రాక్‌లోకి వెళ్తే అదే చెప్పేస్తుంది

దళారులే కాదు. రవాణా శాఖ సిబ్బంది ప్రమేయం లేకుండానే లైసెన్స్ పొందేందుకు సైంటిఫిక్ ట్రాక్‌ను తీసుకొచ్చారు. డ్రైవింగ్ ట్రాక్‌కు హైటెక్ సెన్సార్ విధానం అమర్చారు. సెన్సార్‌ను కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేశారు. ట్రాక్‌లో ఏర్పాటు చేసిన సెన్సార్‌కు తగలకుండా డ్రైవింగ్ చేయాల్సి ఉంటుంది. ట్రాక్‌లో వాహనం నడిపే వ్యక్తి రోడ్డు చివరన తాకినా, డివైడర్‌ను ఢీకొట్టినా, మలుపులు సక్రమంగా తిప్పకపోయినా సెన్సార్ ద్వారా కంప్యూటర్ పసిగడుతుంది. పరీక్షలో అనర్హుడుగా గుర్తిస్తుంది. ట్రాక్‌లో సాధారణ, జారుడు తరహా రోడ్డు, స్పీడ్ బ్రేకర్లు, కుడి, ఎడమ మలుపులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉంటాయి. '8ఎ' ఆకారంలో మలుపుల్లో డ్రైవింగ్ సామర్థ్యం సెన్సార్ ద్వారా కంప్యూటర్ పసిగడుతుంది. క్షుణ్ణంగా పరిశీలించి అర్హత సాధించిన వారికి మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు అవుతుంది. ఈ సెన్సార్ విధానంలో రవాణా శాఖ అధికారులు ఎవరికీ ఎలాంటి సహకారం అందించే పరిస్థితి ఉండదు. ఈ పరీక్షలను అధికారులు కంప్యూటర్ క్యాబిన్‌లో కూర్చొని ఆన్‌లైన్‌లో వీక్షిస్తూ సందేహం ఉన్న అభ్యర్థులకు వీడియో ఫుటేజీని చూపుతారు.

డ్రైవింగ్ లైసెన్స్ అందించే కీలకమైన టెస్టు డ్రైవ్‌లో పారదర్శకతను తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేసింది. నిపున్ ఐటీ సొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్ అమలుకు చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానంతో డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరీక్షించే విధానాన్ని రాష్ట్రంలో తొలిసారిగా చిత్తూరు, అనంతపురంలో అమలు చేసి విజయవంతం కావడంతో పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలులో ఏర్పాటు చేశారు. డ్రైవింగ్ ట్రాక్‌కు సైంటిఫిక్ పరిజ్ఞానం అనుసంధానం చేయడంతో వాహనం ప్రతి కదలికపై నిఘా ఉంటుంది.

విధానం ఇలా..

డ్రైవింగ్ టెస్టు కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారు కేటాయించిన తేదీన కార్యాలయానికి వెళ్తే బయోమెట్రిక్‌ను పరిశీలించి కంప్యూటర్‌లో టోకెన్ జనరేట్ చేస్తారు. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ)ను కంప్యూటర్‌లో దరఖాస్తుకు జతపరుస్తారు. తర్వాత దరఖాస్తుదారుడిని ట్రాక్‌లోకి అనుమతిస్తారు. ఈ విధానంలో వాహనం నడిపే వ్యక్తికి ఓ ట్యాగ్ ఇస్తారు. అతను ట్రాక్‌లోకి వెళ్లగానే అక్కడున్న వీడియో సెన్సార్లు సదరు వ్యక్తి డ్రైవింగ్ నైపుణ్యాన్ని పసిగట్టి మార్కులు కేటాయిస్తాయి. రవాణా శాఖ అధికారులు గానీ, సిబ్బంది గానీ ఇందులో మార్పులు చేసే అవకాశం ఉండదు. నాలుగు చక్రాల వాహనదారుడికైతే కారుకు ఫేస్ మోషన్ డిటెక్షన్ వాచింగ్ యాప్ తగిలించి పరీక్ష జరిపిస్తారు. ఇందుకోసం ట్రాక్‌లో ఓవర్‌హెడ్ వీడియో సెన్సార్లు 10, రీడర్ పోల్స్ 6, ఆటోమెటిక్ సిగ్నల్ లైట్లు 4, హై రెజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

వరుసగా మూడుసార్లు ఫెయిల్ అయితే!

లైసెన్స్ కోసం ప్రతిరోజు 50 మందికి పైగా వాహనదారులు స్లాట్లు బుక్ చేసుకుంటున్నారు. గతంలో ఇందులో సగం మంది ఉత్తీర్ణత సాధించేవారు. అయితే సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్ అమలులోకి వచ్చిన తర్వాత ద్విచక్ర వాహనదారులు కేవలం 5 నుంచి 10 మంది, నాలుగు చక్రాల వాహనదారులు కేవలం ఇద్దరు మాత్రమే నిబంధనల ప్రకారం వాహనాలు నడిపి పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. వరుసగా మూడుసార్లు టెస్ట్ డ్రైవ్‌లో ఫెయిలైతే ఆరు మాసాల వరకు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండదు.

ప్రతి కదలికపై నిఘా



సైంటిఫిక్ డ్రైవింగ్ ట్రాక్ విధానం అమలు వల్ల ప్రతి కదలికపై నిఘా ఉంటుంది. ట్రాఫిక్ నిబంధనలు తెలియకపోతే వాహనం నడిపే వ్యక్తి ఉత్తీర్ణత సాధించలేడు. వాహనం నడపడం రాని వారికి కొంత ఇబ్బందిగా ఉండొచ్చు. ఈ విధానం అమలు వల్ల అధికారులు ఎవరికీ ఎలాంటి సహకారం అందించే పరిస్థితి ఉండదు. టెస్టులో ఫెయిలైనవారు వారం రోజుల తర్వాత మళ్లీ స్లాట్ బుక్ చేసుకుని టెస్టు డ్రైవ్‌కు రావాల్సి ఉంటుంది. వరుసగా మూడుసార్లు ఫెయిలైతే ఆరు మాసాల వరకు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండదు.

– బాబు కిషోర్, ఎంవీఐ

ఆరుగాలం శ్రమ అరక్షణంలో దొంగపాలు

- బేకరీలోకి వెళ్లి వచ్చేలోగా బైక్‌లో ఉంచిన నగదును కొట్టేసిన దుండగులు


బాధిత రైతు బోయ రామాంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: రైతు ఆరుగాలం శ్రమించి పంటను పండించి, దిగుబడిన విక్రయించగా వచ్చిన డబ్బును క్షణంలో దొంగ దోచుకెళ్లాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని దైవందిన్నె గ్రామానికి చెందిన రైతు బోయ రామాంజనేయులు మిరప పంట సాగుచేశాడు. వచ్చిన దిగుబడిని రెండు రోజుల క్రితం బ్యాడిగిలో విక్రయించాడు. సదరు వ్యాపారి రైతు బ్యాంకు ఖాతాలో నగదును జమచేశారు. రైతు రామాంజనేయులు సోమవారం పట్టణంలోని కార్పొరేషన్ బ్యాంక్‌కు వెళ్లి రూ.2 లక్షలు డ్రా చేశాడు. నగదును బైక్ ట్యాంక్ కవరులో పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. రోడ్డుపై బేకరీలో పిల్లలకు దిల్‌పసంద్ తీసుకుందామని బైక్‌ను నిలిపి వెళ్లి అడగ్గా లేదని చెప్పడంతో క్షణంలో తిరిగి వచ్చినా ఆలోపే దుండగులు నగదును దోచుకెళ్లారు. సంవత్సరం పడ్డ కష్టం క్షణాల్లో దొంగలపాలు కావడంతో రైతు గుండెను బాదుకుని రోధించారు. దొంగను చూశారా అని అక్కడున్న వారందరినీ అడిగినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఘటనపై బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సుదర్శన్‌రెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం బ్యాంకు, బేకరీ వద్ద సీసీ ఫుటేజీ దృశ్యాలను పరిశీలించి రైతు వెంట అనుమానాస్పదంగా ఎవరైనా ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దొంగ కోసం గాలిస్తున్నారు.

ఘరానా మోసగాడి అరెస్ట్


నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు: డబ్బు రెట్టింపు చేస్తానని నమ్మించి మోసానికి పాల్పడిన చిన్న సుబ్బరాయుడు అలియాస్ నాయుడును రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. వివరాలు.. నెల్లూరు జిల్లాకు చెందిన నాయుడు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారంలో కర్నూలు భాస్కర్‌నగర్‌కు చెందిన సయ్యద్ మహమ్మద్‌కు పరిచయమయ్యాడు. కెమికల్స్ కలిపితే డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించాడు. మహమ్మద్ వద్ద కొన్నాళ్ల క్రితం రూ.5 వేలు తీసుకుని కెమికల్స్ కలిపినట్లుగా నమ్మించి రూ.10 వేలు ముట్టజెప్పాడు. దీంతో మహమ్మద్ డబ్బుకు ఆశ పడి తన బ్యాంకు ఖాతా, కన్‌స్ట్రక్షన్ ఆఫీస్ ఖాతాలో ఉన్న రూ.19.50 లక్షలు డ్రా చేసి నాయుడుకు ముట్టజెప్పేందుకు సిద్ధం చేసుకున్నాడు. జులై 19న అశోక్‌నగర్‌లోని మహమ్మద్ ఆఫీస్‌కు నాయుడుతో పాటు మరో వ్యక్తి వచ్చారు. నగదు కట్టలను డబ్బాలో వేసి ద్రావణం చల్లి కొద్దిసేపట్లో రెట్టింపు అవుతుందని నమ్మించారు. మహమ్మద్ దృష్టి మళ్లించి డబ్బాలోని నగదును తస్కరించి తెలుపు, నలుపు కాగితాల కట్టలను డబ్బాలో పెట్టారు. తర్వాత డబ్బు రెట్టింపు చేసే మిషన్ తీసుకొస్తానని మహమ్మద్ కారులో బయటకు వెళ్లి, పెద్దాసుపత్రి వద్ద టిఫిన్ చేస్తానని నమ్మించి డబ్బుతో ఉడాయించాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన మహమ్మద్ రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో మంగళవారం సీఐ నాగరాజరావు సిబ్బందితో కలిసి నాయుడును ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం తాళ్లూరు మండలం మాధవవరంలో అదుపులోకి తీసుకున్నారు. కర్నూలుకు తీసుకొచ్చి విచారించ గా నేరం అంగీకరించాడు.రూ.18.20 లక్షలు స్వాధీనం చేసుకుని నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

మద్దికెర: స్థానిక మద్దికెర – గుంతకల్లు రహదారిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. గత కొన్ని నెలలుగా వృద్ధుడు పెట్రోలు బంకు సమీపంలోని రూముల వద్ద ఉంటూ అక్కడున్న వారికి చిన్నచిన్న పనులు చేస్తూ వారు పెట్టే భోజనంతో కడుపు నింపుకునేవాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ చెన్నయ్య, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెవెన్యూ అధికారులతో పంచనామా నిర్వహించి అంత్యక్రియలు చేశారు.

25న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈ నెల 25న అండర్–14 విభాగంలో క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె. దేవేందర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీలో పాల్గొంటుందని వెల్లడించారు.

ఇసుక అక్రమ తరలింపుపై విచారణ

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామ సమీపంలో హంద్రీ నదిలోని ఇసుక దిబ్బలను మంగళవారం మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కొందరు అధికార పార్టీ నాయకులు హంద్రీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గంజిహళ్లికి చెందిన మాజీ ఎంపీటీసీ గంజిల్లయ్య, గ్రామస్తులు సోమవారం కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారులు స్పందించి విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా మైనింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తన సిబ్బందితో మంగళవారం గంజిహళ్లి హంద్రీ నది వద్దకి వెళ్లి కొంతవరకు పరిశీలించారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి నదిలో నీరు ప్రవహిస్తుండడంతో ఇసుకను అక్రమంగా తరలించే ప్రాంతానికి వెళ్లలేకపోయారు. అయితే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని రాజశేఖర్ తెలిపారు.

మరణంలోనూ తోడుగా..

- భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య మృతి


చిన్నతిరుపాలు, అక్కమ్మ (ఫైల్)

ఆత్మకూరు: యాభై ఏళ్ల దాంపత్య జీవితం.. అన్యోన్యమైన అనురాగం.. ఐదుగురు సంతానంతో ఆనందంగా గడిపిన దంపతులు మరణంలోనూ ఒక్కటిగా నిలిచారు. వివరాలు.. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామంలో తిరుపాల్ (75), అక్కమ్మ (70) దంపతులకు ఐదుగురు కుమారులు ఉన్నారు. తిరుపాల్ కొద్ది రోజులుగా జ్వరంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. కోలుకోలేక మంగళవారం కన్నుమూశాడు. దీంతో భార్య అక్కమ్మ ఉదయం నుంచి విలపిస్తూనే ఉంది. ఆమెను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. యాభై ఏళ్లుగా దాంపత్య జీవితంలో ఒకరినొకరు తోడుగా ఉన్నామని గుర్తు చేసుకుంటూ విలపిస్తోంది. అనంతరం దహన సంస్కారాలకు మృతదేహాన్ని తరలించారు. కార్యక్రమం పూర్తి చేసి ఇంటికి చేరుకున్న గంట వ్యవధిలోనే ఒక్కసారిగా అక్కమ్మ కుప్పకూలిపోయి మృతిచెందింది. మధ్యాహ్న సమయంలో తండ్రి మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించిన కుమారులు తిరిగి తల్లి భౌతిక కాయాన్ని సైతం అదే బాటలో తీసుకెళ్లి దహన సంస్కారాలు చేశారు. గంట వ్యవధిలోనే దంపతులు మృతి చెందడంతో సోమయాజులపల్లె గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒకేరోజు తల్లిదండ్రులను కోల్పోయిన కుమారులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

పిడుగుపాటుకు బాలిక మృతి


వడ్డె ఆదిలక్ష్మి (ఫైల్)

నందవరం: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన ఆ కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. పిడుగు రూపంలో ఆ ఇంటి గారాల పట్టిని కబళించింది. ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇవి.. మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన వడ్డె వీరశేఖర్, రామలక్ష్మి దపంతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె ఆదిలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు తెలంగాణ రాష్ట్రం, జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలం మల్దకల్ గ్రామానికి సీడ్ పత్తి క్రాసింగ్ చేయడానికి వలస వెళ్లారు. కుమార్తెను అక్కడే ఉంచి వీరశేఖర్, రామలక్ష్మి దంపతులు ఉరుకుంద ఈరన్న స్వామికి మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం గ్రామానికి వచ్చారు. సోమవారం ఉరుకుందకు వెళ్లి స్వామికి మొక్కులు తీర్చుకుని గ్రామానికి చేరుకున్నారు. కుమార్తె ఆదిలక్ష్మి మరణించినట్లు బంధువులు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయడంతో దంపతులు కుప్పకులిపోయారు. సీడ్ పత్తి క్రాసింగ్ చేస్తుండగా ఆదిలక్ష్మి (15) పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు తెలిసింది. బాలిక మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. క్షేమంగా ఉన్న బాలికను పిడుగు రూపంలో మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

దేవనకొండ: ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపేట వద్ద చోటుచేసుకుంది. పత్తికొండ మండలం జూటూరు గ్రామం నుంచి ముగ్గురు రైతులు కూరగాయల లోడుతో మంగళవారం ఆటోలో జూటూరు నుంచి కర్నూలుకు బయలుదేరారు. కూరగాయలు ఆటోలో ఎక్కించి ముగ్గురు ఆటోపై కూర్చొన్నారు. దేవనకొండ మండలం కొత్తపేట స్టేజీకి వద్దకు రాగానే ఒక్కసారిగా ఆటో వెనుక టైరు పగలడంతో ఆటో బోల్తా పడింది. రైతుమధుకి తీవ్ర గాయాలు కాగా, రాజు, లక్ష్మి, నారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌లో వారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మధు(42) చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సమస్య తలెత్తితే 'డయల్ 100'


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సాక్షి, నంద్యాల: జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు 100కు డయల్ చేయాలని సూచించారు. 22 బృందాలుగా ఏర్పడి 51 వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు ఫుడ్ సేఫ్టీని వివరించారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాల నివారణ, మహిళలపై జరిగే నేరాలు, ఈవ్‌టీజింగ్‌ను ఎలా ఎదుర్కోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

64 మందిపై కేసులు

నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న 283 మందిపై కేసు నమోదు చేసి రూ.1,53,245 జరిమానా విధించినట్లు జిల్లా పోలీసు కార్యాలయం అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 64మందిపై కేసులు నమోదు చేశారు. నెంబర్ ప్లేట్స్ లేకుండా తిరుగుతున్న 40 వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు పాలైన టమా'రా'


నేమకల్లు గ్రామం వద్ద రోడ్డు పక్కన పారబోసిన టామాటాలు

చిప్పగిరి: టమాట ధర పూర్తిగా పడిపోవడంతో రైతులు నట్టేట మునుగుతున్నారు. మండలంలోని కొందరు రైతులు బోర్ల కింద, మరికొందరు వర్షాధారంగా టమాట సాగు చేశారు. వర్షాధారం కింద సాగు చేసిన టమాటాలు రాక ముందే రేటు దారుణంగా పడిపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇక బోరు బావుల కింద సాగుచేసిన రైతులు పండించిన టమాటాలు సమీపంలోని మార్కెట్‌కు తరలిస్తుండగా 20 కేజీల బాక్సు ధర రూ.150 –రూ.250 వరకు పలుకుతుండటంతో రవాణా ఖర్చులకు కూడా సరిపోక తలలు పట్టుకుంటున్నారు. మంగళవారం మండలంలోని నేమకల్లు రోడ్డు పక్కన కొందరు టమాట రైతులు దిగుబడులను పడేసి వెళ్లడం గమనార్హం.

● గద్దెరాళ్ల మారెమ్మా.. చల్లగా చూడమ్మా


బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న మహిళలు

శ్రావణమాసం మూడో మంగళవారం సందర్భంగా పల్లెదొడ్డి, గద్దెరాళ్ల గ్రామస్తులు గద్దెరాళ్ల మారెమ్మవ్వకు బోనాలతో వచ్చి చలువ సమర్పించారు. బోనాల్లో పెరుగు అన్నం తీసుకొచ్చి ప్రసాదంగా అమ్మవారికి సమర్పించారు. ఇలా చేయడం వల్ల అమ్మవారు శాంతించి ఆ గ్రామాలను దుష్టశక్తుల నుంచి కాపాడుతారని, అలాగే పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల నమ్మకం.

– దేవనకొండ